సాక్షి అనంతపురం

శనివారం । 2 । నవంబర్ । 2024



పని చేయించుకుని..

ఎన్నికల సమయంలో ఉద్యోగులతో పనులు చేయించుకున్న ఎన్నికల విభాగం అధికారులు రెమ్యునరేషన్‌ను మరిచారు.

8లో



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి ధర రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

36.1°/20.8°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో పనిచేయాలి



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: భిన్నత్వంలో ఏకత్వం అని చాటిన మహనీయుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో అందరూ పనిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. దివంగత ఉప ప్రధాని వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడిన వల్లభాయ్ పటేల్ సంకల్పాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, విభాగాధిపతులు వసంతలత, రియాజుద్దీన్, యుగేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్లు కనకరాజు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ లక్షణాలతో చిన్నారి మృతి



ఆరాధ్య (ఫైల్)

ఉరవకొండ: మండల కేంద్రం ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీలో నివాసముంటున్న మారుతి, మహేశ్వరి దంపతుల కుమార్తె ఆరాధ్య (7) డెంగీ లక్షణాలతో గురువారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. ఆరాధ్యకు 10 రోజుల క్రితం తీవ్ర జ్వరం వచ్చింది. స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో బళ్లారికి తీసుకెళ్లి చూపించగా.. వైద్య పరీక్షల్లో డెంగీ జ్వరమని, ప్లేట్‌లెట్లు తగ్గాయని తేలింది. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అయినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి గురువారం ఆస్పత్రిలోనే మృతి చెందింది. ఒక్కగానొక్క కుమార్తె మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బాలల సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- జిల్లా పర్యవేక్షణ అధికారి ఫారూక్‌బాషా

అనంతపురం/సెంట్రల్: జువైనల్ జస్టిస్ యాక్ట్–2015 ప్రకారం పిల్లల సంరక్షణ, సంక్షేమం కోసం పనిచేస్తున్న సంస్థలు, వ్యక్తులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణ సేవలు, వీధి బాలల సంక్షేమశాఖ జిల్లా పర్యవేక్షణాధికారి ఫారూక్‌బాషా సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంరక్షణ అవసరమైన పిల్లలు, చట్టంతో విభేదించిన పిల్లల సంరక్షణను పూర్తిగా, పాక్షికంగా చూస్తున్న సంస్థలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు పొందే సంస్థలు, తదితర బాల సంరక్షణ కేంద్రాలన్నీ జువైనల్ జస్టిస్ యాక్ట్ కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు https://wdcw.ap.gov.in/వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు. నిబంధనలు పాటించని సంస్థల నిర్వాహకులకు ఏడాది జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని వివరించారు.



అనంతపురం మొదటిరోడ్డు శివాలయంలో దీపావళి నోములు నోచుకుంటున్న భక్తులు

ఆనందాల దీపావళి

అనంతపురం కల్చరల్: దీపావళి పర్వదినం అంతులేని ఆనందాలను తెచ్చింది. నరక చతుర్దశి, దీపావళి అమావాస్య ఒకేరోజు వచ్చింది. వెలుగు దివ్వెల దీపావళి శోభ జిల్లా అంతటా సంబరంగా సాగింది. ప్రతి ఇల్లు టపాసుల మోతతో హోరెత్తిపోయింది. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ బాణసంచా పేలుస్తూ ఆనందంలో మునిగితేలారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దీపావళినాడు పలు అనాథ, వృద్ధాశ్రమాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

నియమ నిష్ఠలతో నోములు : సంప్రదాయంగా వస్తున్న దీపావళి లక్ష్మీ పూజలు ఇంటింటా, వ్యాపార సంస్థల్లో ఘనంగా జరిగాయి. గురువారం అనంతపురంలోని ఆర్‌ఎఫ్‌రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, పాతూరు మహాలక్ష్మీ ఆలయంతో పాటు పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో లక్ష్మీ పూజలు శాస్త్రోక్తంగా సాగాయి. దీపావళి అమావాస్య సందర్భంగా అనంతపురం మొదటి రోడ్డు శివాలయంలో సామూహిక నోములు, గౌరీ వ్రతాలను మహిళలు నియమనిష్ఠలతో సంప్రదాయబద్ధంగా ఆచరించారు.



అనంతపురంలో మిరుమిట్లు గొలుపుతున్న బాణాసంచా

వివరాలు లేకుండానే బదిలీలా?

- తప్పుల తడకగా సీనియార్టీ జాబితా
- బదిలీ, రిటైర్డ్ టీచర్ల పేర్లు జాబితాలో
- తలలు పట్టుకుంటున్న విద్యాశాఖ అధికారులు
- టీచర్ల వివరాల కోసం మునిసిపల్ ఆర్డీకి లేఖ
- అనంతపురం కార్పొరేషన్ ఒక యూనిట్‌గా, ఉమ్మడి జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలు ఒక యూనిట్‌గా పదోన్నతులు
- 6న హెచ్‌ఎంలు, 8న స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కౌన్సెలింగ్



తెప్పించుకుంటున్నాం



మునిసిపల్ టీచర్లకు సంబంధించిన వివరాలు ఏవీ మావద్ద లేవు. షెడ్యూలు ప్రకారం పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలనే ఉద్దేశంతో మునిసిపల్ ఆర్డీ నుంచి తెప్పించుకున్న తాత్కాలిక సీనియార్టీ జాబితాను ప్రదర్శించాం. వీటిపై అభ్యంతరాలను స్వీకరిస్తున్నాం. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓల నుంచి వివరాలు తెప్పించుకుంటున్నాం. క్షుణ్ణంగా అధ్యయనం చేసి అర్హుల జాబితాను ప్రకటించి పదోన్నతులు చేపడతాం.

– ప్రసాద్‌బాబు, డీఈఓ

అనంతపురం ఎడ్యుకేషన్: తొలిసారిగా మునిసిపల్ టీచర్ల పదోన్నతుల ప్రక్రియను విద్యాశాఖ చేపట్టింది. ఆ టీచర్ల వివరాలు లేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వమేమో 'తాంబూలాలిచ్చాం తన్నుకుచావండి' అన్న చందంగా మునిసిపల్ స్కూళ్లలో పని చేస్తున్న టీచర్లకు స్కూల్ అసిస్టెంట్, హెచ్‌ఎం ప్రమోషన్లు విద్యాశాఖ చేపట్టాలంటూ షెడ్యూలు విడుదల చేసింది. ఈ క్రమంలో ఈ నెల 6న హెచ్‌ఎం పదోన్నతులు, 8న స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు కౌన్సెలింగ్ చేపట్టాల్సి ఉంది. అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్ ఒక యూనిట్‌గా, ఉమ్మడి జిల్లాలోని తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు, కదిరి, ధర్మవరం, హిందూపురం మునిసిపాలిటీలు ఒక యూనిట్‌గా పదోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నారు. అయితే ముందుగా సీనియార్టీ జాబితా తయారు చేయాల్సి ఉంది. విద్యాశాఖ అధికారుల వద్ద ఎలాంటి రికార్డులూ లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో మునిసిపల్ ఆర్డీకి లేఖ రాశారు. అక్కడి నుంచి ఇప్పటిదాకా సరైన వివరాలు రాలేదు.

పాత జాబితాతో మమ

షెడ్యూలు ప్రకారం గత నెల 28న తాత్కాలిక సీనియార్టీ జాబితాను ప్రదర్శించాల్సి ఉంది. విద్యాశాఖ వద్ద ఎలాంటి రికార్డులు లేక జాబితా తయారు చేయలేదు. గడువు ముంచుకురావడంతో మునిసిపల్ ఆర్డీ కార్యాలయానికి పరుగున వెళ్లి అందుబాటులో ఉన్న సీనియార్టీ జాబితా తీసుకొచ్చారు. దీన్నే తాత్కాలిక జాబితా అంటూ ప్రదర్శించారు. ఈ జాబితా మొత్తం తప్పులతడకగా ఉందంటూ టీచర్లు గగ్గోలు పెడుతున్నారు.

జాబితాలో రిటైర్డ్ టీచర్లు, బదిలీ టీచర్లు

అనంతపురంలోని పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశులు, రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బండి పద్మావతి, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) రమేష్‌బాబు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పి.అజయ్‌కుమార్, ఎస్జీటీలు సీఎం సత్యనారాయణ, దేవరత్నమ్మ వీరంతా రిటైర్డ్ అయ్యారు. కానీ సీనియార్టీ జాబితాలో వీరిపేర్లు ఉన్నాయి. అలాగే గుంతకల్లు మునిసిపాలిటీ సరోజిని స్కూల్‌లో బయలాజికల్ సైన్స్ టీచర్‌గా పని చేస్తున్న పీఎస్ రాధ కర్నూలు జిల్లా ఆదోని మునిసిపల్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. ఈమె పేరూ ఇందులో ఉంది. మునిసిపల్ ఆర్డీ అధికారులు కనీస కసరత్తు చేయకుండానే పాత జాబితానే పంపించి చేతులు దులుపుకొన్నారు.

ఖాళీలపై కసరత్తు

నగరపాలక సంస్థ స్కూళ్లు, మునిసిపల్ స్కూళ్ల హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ ఖాళీలపై కసరత్తు చేస్తున్నారు. అనంతపురంలో మూడు హెచ్‌ఎం పోస్టులు, రాయదుర్గంలో రెండు, గుంతకల్లులో ఒక పోస్టు ఉన్నట్లు గుర్తించారు. స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల వివరాలను తెప్పించుకుంటున్నారు.

ముగిసిన ఐటీ సోదాలు

అనంతపురం: రియల్ ఎస్టేట్ రంగంలో భారీగా ఆర్థికలావాదేవీలు నిర్వహించిన అనంతపురానికి చెందిన గల్లా రవీంద్రనాథ్, గల్లా వెంకట శ్రీనివాసల ఇళ్లల్లో బుధవారం రాత్రి నుంచి ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ అధికారులు చేపట్టిన సోదాలు గురువారం మధ్యాహ్నం ముగిశాయి. పత్రాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వారి ఇళ్లల్లో భారీ మొత్తంలో నగదును సీజ్ చేసినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన పత్రాలను అందించాలని ఆదాయపు పన్ను శాఖ అధికారులు కోరారు.

భూముల రేట్లు అమాంతం పెరగడంతో..

అనంతపురం రామ్‌నగర్‌లోని భూములకు విపరీతమైన డిమాండ్ ఉంది. సంపన్నులు మాత్రమే కొనగలిగే ఏరియా కావడంతో ఇక్కడ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఫలితంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రూ.కోట్లలో లావాదేవీలు సాగిస్తున్నారు. అయితే ప్రభుత్వానికి పన్ను కట్టకుండా ఎగ్గొడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. అమ్మిన ధరలో సగం బ్లాక్, సగం వైట్ మనీగా స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు రియల్ ఎస్టేట్ వారి కదలికలపై దృష్టి పెట్టారు.

ఆయకట్టు వివరాలపై అభ్యంతరాలకు నేడు గడువు

అనంతపురం సెంట్రల్: సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆయకట్టు వివరాలు ఫారం–ఏ రూపంలో గ్రామ పంచాయతీ, ఎంపీడీఓ కార్యాలయాల్లో పొందుపర్చినట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయకట్టుదారులు వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే శనివారం సాయంత్రం 5 గంటలలోపు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫారం–ఏఏ ఆదివారం ప్రచురిస్తామని తెలిపారు.

'ఉపాధి' పనులు పకడ్బందీగా చేపట్టండి



వెంకటాంపల్లిలో కొండపై చేపట్టిన ఖండిత కందకాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

వజ్రకరూరు/ ఉరవకొండ: ఉపాధి హామీ పథకం పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం వజ్రకరూరు, ఉరవకొండ మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పరిసరప్రాంతంలో కొండపై ఉపాధి హామీ కింద చేపట్టిన ఖండిత కందకాలు పనులను పరిశీలించారు. అటు నుంచి గ్రామంలో ఆనంద్ అనే వ్యక్తి ఇంటి వద్ద రూ.2.30 లక్షలతో చేపడుతున్న వ్యక్తిగత పశువులపాక నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారుతో మాట్లాడారు. అనంతరం రాగులపాడులో ఉపాధి హామీ కింద మట్టి రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కొలతల ప్రకారం ఖండిత కందకాలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వీటిపై వచ్చే సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని డ్వామా పీడీ సలీం బాషాను ఆదేశించారు. వజ్రకరూరులో ఇంటింటికీ వెళ్లి సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి పింఛన్ల పంపిణీ తీరును ఆన్‌లైన్‌ద్వారా పర్యవేక్షించారు. తర్వాత ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. అటు నుంచి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధి హామీ కింద ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. తన పర్యటనలో మండల స్పెషలాఫీసర్ ఆదిశేషానాయుడు కన్పించకపోవడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఎందుకు గైర్హాజరయ్యారో తెలుసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం –దీపం–2ను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా అంతటా ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేపట్టారు. పథకం అమలులో ఇబ్బందులు ఎదురైతే టోల్‌ఫ్రీ నంబరు 1967కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్వామా ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూషనల్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో కలెక్టర్ ర్యాలీ నిర్వహించారు.

ఉమ్మడి జిల్లా అంతటా కరువే

- పూర్తిగా దెబ్బతిన్న ఖరీఫ్ పంటలు
- అన్ని మండలాలనూ కరువు జాబితాలో చేర్చాలి
- క్షేత్రస్థాయిలో పరిశీలించి.. వాస్తవాలు తెలుసుకోండి
- రైతులను ఆదుకునేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నందున అన్ని మండలాలనూ కరువు జాబితాలో చేర్చాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లాలో 7, శ్రీసత్యసాయి జిల్లాలో 10 కలుపుకుని మొత్తం 17 కరువు మండలాలుగా ప్రకటించి, మిగతా 46 మండలాలను విస్మరించారని సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు. కరువు మండలాల నిర్ధారణకు ప్రభుత్వం తీసుకున్న ప్రామాణికాలు రైతులను ఆర్థికంగా దెబ్బతీసేవిగా ఉన్నాయన్నారు. జూన్‌లో సకాలంలో వర్షం వచ్చినా.. జూలై నుంచి ఆగస్టు 20 వరకు దాదాపుగా 55 రోజులు జిల్లాలో ఎక్కడా వర్షం రాలేదన్నారు. ఖరీఫ్‌లో జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో సరాసరి తీసుకుని 35 మిల్లీలీటర్లు అధికంగా వచ్చాయని, కేవలం కొన్ని మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించారని అన్నారు. నాడు వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు.. నేడు కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకునే విషయంలో అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.

మంత్రులు ప్రత్యేక చొరవ చూపాలి

గతేడాది 2023–24 ఖరీఫ్‌లో రైతులకు బీమా వచ్చిందని, ఎన్నికల కోడ్ కారణంగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేకపోయిందని అనంత అన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది ఇన్‌పుట్ సబ్సిడీ మాట ఎత్తకుండా ఉమ్మడి జిల్లా రైతులకు చంద్రబాబు ద్రోహం చేశారన్నారు. 46 మండలాలకు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ అందకుండా చేసిన పాపం ఆయనదేనన్నారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని అన్ని మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటన చేయించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. సమస్యలపై ప్రతిపక్షాలు మాట్లాడితే విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజాప్రతినిధులంతా రైతులను ఆదుకునేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

ప్రధాని మోదీతో ప్రకటన చేయించాలి

ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్‌ను 45.72 మీటర్ల ఎత్తుతోనే నిర్మిస్తామని ప్రధాని మోదీతో ప్రకటన చేయించాలని, లేనిపక్షంలో మరోసారి కూటమి పార్టీలు, ప్రజాప్రతినిధులు రాష్ట్రానికి ద్రోహం చేసినవారవుతారని అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పోలవరం ఎత్తు 45.72 మీటర్లు ఉంటే సుమారు 195 టీఎంసీల నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలా కాకుండా ప్రాజెక్ట్ ఎత్తును 41.15 మీటర్లకు పరిమితం చేయడం ద్వారా గరిష్టంగా 115 టీఎంసీలు మాత్రమే నిల్వ అవుతుందన్నారు. ఇదే జరిగితే పోలవరం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనమూ లేకుండా పోతుందన్నారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు నాగార్జున సాగర్‌కు వెళ్తున్నాయని, పోలవరం పూర్తయితే ఆ నీటిని రాయలసీమ ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్ట్ విషయంలో గత ప్రభుత్వంపై అనేక విమర్శలు చేశారని, కానీ నేడు ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించేలా నిర్ణయం తీసుకున్నా కూటమి ప్రజాప్రతినిధులు ఎందుకు అభ్యంతరం తెలపలేదని ప్రశ్నించారు.

సప్తగిరి క్యాంఫర్‌లో ఆరుగురికి అస్వస్థత



విద్యుత్‌షాక్‌కు గురై అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సొరయ్య, హరిబాబు, క్రిష్ణ, నాగేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ

- రియాక్టర్‌లో మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌షాక్
- ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు
- ఒకరి పరిస్థితి విషమం

శింగనమల: లోలూరు పంచాయతీలోని బి.కొత్తపల్లి సమీపంలో ఉన్న సప్తగిరి క్యాంఫర్ ఫ్యాక్టరీలో రియాక్టర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఆరుగురు సిబ్బంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సప్తగిరి క్యాంఫర్ ఫ్యాక్టరీలో ఆర్–3 రియాక్టర్ చెడిపోయింది. మరమ్మతు పనులను మధ్యాహ్న సమయంలో చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన సొరయ్య, బుక్కరాయసముద్రానికి చెందిన హరిబాబు, కల్లూరుకు చెందిన క్రిష్ణ, అనంతపురానికి చెందిన రియాక్టర్ ఇన్‌చార్జ్ నాగేంద్రప్రసాద్, శ్రీకాకుళంకు చెందిన లక్ష్మీనారాయణ, ఓబిలేసు మరమ్మతు పనులకు ఉపక్రమించారు. రియాక్టర్‌లో చిన్న చిన్న రంధ్రాలుంటే వాటిని వెల్డింగ్ చేయడానికి ముగ్గురు రియాక్టర్‌లోకి దిగారు. కానీ కింద విద్యుత్ ఎర్త్ ఉండడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే పైనున్న వారు వారిని కాపాడానికి ప్రయత్నించగా వారూ కింద పడిపోయారు. ఒకరి మీద ఒకరు పడిపోవడంతో, వెంటనే గుర్తించిన మిగిలిన సిబ్బంది ఫ్యాక్టరీని షట్‌డౌన్ చేశారు. రియాక్టర్‌లో పడిపోయిన వారిని బయటకు తీశారు. వారందరూ అస్వస్థతకు గురికావడంతో వెంటనే ఫ్యాక్టరీ వాహనాల్లో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారిలో నాగేంద్ర ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ శరత్‌చంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పింఛన్ కోసం పడిగాపులు



అనంతపురం హౌసింగ్‌బోర్డులోని ఇళ్ల వద్దకు వెళ్లకుండా ఆలయం వద్దకు లబ్ధిదారులను పిలిపించుకుని పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం/ అనంతపురం కార్పొరేషన్: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం కొనసాగుతోంది. గత ప్రభుత్వంలో వేకువజాము నుంచే లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ అందజేసేవారు. కూటమి పాలనలో అందుకు భిన్నంగా సాగుతోంది. శుక్రవారం అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. హౌసింగ్ బోర్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం వద్దకు లబ్ధిదారులను పిలిపించుకుని పింఛన్ పంపిణీ చేయడం గమనార్హం. వినాయకనగర్, పాతూరు, వేణుగోపాల్‌నగర్, రామ్‌నగర్, ఆదర్శనగర్, నాయక్ నగర్, సాయినగర్, తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల కూడా ఆలస్యంగానే పంపిణీ కొనసాగింది. జిల్లాలో 2,82,554 మంది పింఛన్‌దారులకు రూ.123,99,52,500 మంజూరైంది. తొలిరోజు 2,52,104 మందికి రూ.110,40,74,500 సొమ్మును పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు.

'తమ్ముళ్ల' పెత్తనం

ఒకటో తారీఖు వచ్చిందంటే చాలు సచివాలయ సిబ్బంది వెన్నులో వణుకు పుడుతోంది. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం కాస్తా టీడీపీ కార్యక్రమంగా మారింది. కలెక్టర్, మండల స్థాయి అధికారులు లేదా ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేపట్టవచ్చు. అలా కాకుండా అధికార పార్టీలో ఉన్న అనామకులు, ప్రజాప్రతినిధులు కాని వారిని ముందు పెట్టి కార్యక్రమం చేపడుతున్నారు. అనంతపురం శివారులోని ఎ.నారాయణపురం పంచాయతీలో టీడీపీ నేత రాయల్ మురళి, కార్యకర్త గాజుల ముత్యాలన్న సచివాలయ సిబ్బందిని సైతం వెనక్కునెట్టి అంతా తామై హడావుడి చేయడం చూసి జనం ముక్కున వేలేసుకున్నారు.

పింఛన్ల పంపిణీలో 'తమ్ముళ్ల' గొడవ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 16వ సచివాలయం ఒకటో క్లస్టర్ పరిధిలో శుక్రవారం జరిగిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్ల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. వార్డు ఎడ్యుకేషన్ సెక్రెటరీతో కలిసి కౌన్సిలర్ నాగరత్న లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తుండగా టీడీపీ నాయకుడు కదిరప్ప అడ్డుతగిలాడు. రెండు నెలల కింద వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన మీ పెత్తనమేంటని కౌన్సిలర్‌తో వాదనకు దిగాడు. విషయం తెలుసుకున్న ఆమె భర్త వాసు, ఇతర నాయకులు అక్కడికి చేరుకుని తీవ్రమైన దుర్భాషలాడుకుంటూ పరస్పరం తోపులాడుకున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఉన్నతాధికారులను ఆరా తీయగా ప్రతి నెలా తమకు ఇదే తలనొప్పిగా మారిందని వాపోయారు. ఒకరికైతే సమాధానం చెప్పొచ్చు. కానీ కూటమిలోని మూడు పార్టీల నాయకుల ఆధిపత్య పోరులో సచివాలయ ఉద్యోగులు నలిగిపోతున్నారని అన్నారు.

క్లుప్తంగా

చైన్ స్నాచర్ అరెస్ట్

తాడిపత్రి అర్బన్: వృద్ధురాలి మెడలోని గొలుసు అపహరించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. తాడిపత్రిలోని సీపీఐ కాలనీలో నివాసముంటున్న వృద్ధురాలు నల్లబోతుల రంగమ్మ గత నెల 15న తన ఇంటి ముందు కూర్చొని ఉండగా... ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసు అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం ఉదయం బైపాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో ద్విచక్ర వాహనం (ఏపీ 02 ఏఆర్ 3742) వచ్చిన మహేష్‌ను ఆపి పరిశీలించారు. అతని వద్ద మూడు తులాల బరువున్న బంగారు గొలుసు గుర్తించి ఆరా తీశారు. ఆ సమయంలో మహేష్ తడబడడంతో తమదైన శైలిలో పోలీసులు విచారణ చేయడంతో వృద్ధురాలి మెడలోని గొలుసును తన అన్న హరీష్ సాయంతో అపహరించుకెళ్లినట్లుగా అంగీకరించాడు. దీంతో గొలుసును స్వాధీనం చేసుకుని మహేష్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. హరీష్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పని చేయించుకుని.. ప్రతిఫలం మరచి

- కలెక్టరేట్ ఎన్నికల విభాగం నిర్వాకం
- ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ విధులు నిర్వర్తించిన 100 మంది ఉద్యోగులు
- ఏడాది గడిచినా రెమ్యునరేషన్ ఇవ్వని వైనం
- పేరుకుపోయిన రూ.15 లక్షల బకాయిలు



గత ఏడాది నవంబరు 9న ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ ముగిసిన క్రమంలో రికార్డులను పరిశీలిస్తున్న అప్పటి కలెక్టర్ గౌతమి (ఫైల్)

అనంతపురం అర్బన్: ఎన్నికలకు సంబంధించి ఉద్యోగులు నిర్వర్తించే విధులకు రెమ్యునరేషన్ చెల్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తుంది. అయితే ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) విధులు పూర్తి చేసిన ఉద్యోగులకు ఏడాది గడిచినా రెమ్యునరేషన్ చెల్లించకుండా ఎన్నికల విభాగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది.

పట్టించుకోని అధికారులు

జిల్లాకు సంబంధించి ఈవీఎంలను ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ గత ఏడాది అక్టోబరు 16వ తేదీ నుంచి నవంబరు 10వ తేదీ వరకు జరిగింది. ఈ విధుల్లో ప్రభుత్వ శాఖలకు చెందిన వివిధ కేడర్ అధికారులు, ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది దాదాపు వంద మంది పాల్గొన్నారు. ఉద్యోగి కేడర్‌ను బట్టి రోజుకు రూ.250, రూ.350, రూ.400 చొప్పున రెమ్యునరేషన్ చెల్లించాల్సి ఉంది. అయితే ఏడాది గడిచినా రెమ్యునరేషన్ ఊసెత్తకుండా అధికారులు మిన్నకుండిపోయారు. విధుల్లో పాలుపంచుకున్న ఉద్యోగులు ఎన్నిసార్లు అడిగినా ఎన్నికల అధికారులు కనీసం నోరు కూడా విప్పడం లేదు. ఎఫ్ఎల్‌సీ విధులు నిర్వర్తించిన 26 రోజులకు ఒక్కొక్క ఉద్యోగికి వారి కేడర్‌ను బట్టి రూ.6,500, రూ.9,100, రూ.10,400 చొప్పున వంద మందికి దాదాపు రూ.15 లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లని అధికారులు

ఎఫ్ఎల్‌సీ విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు చెల్లించాల్సిన రెమ్యునరేషన్ అంశాన్ని జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంలో ఎన్నికల విభాగం అధికారులు నిర్లక్ష్యం వహించినట్లుగా తెలుస్తోంది. ఎఫ్ఎల్‌సీ చేసినప్పుడు కలెక్టర్‌గా ఎం.గౌతమి ఉన్నారు. ఆమె బదిలీపై వెళ్లారు. అటు తరువాత కలెక్టర్‌గా వి.వినోద్‌కుమార్ ఈ ఏడాది ఏప్రిల్ 5న బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఎఫ్ఎల్‌సీకి సంబంధించి చెల్లించాల్సిన రెమ్యునరేషన్ విషయాన్ని ఆయన దృష్టికి ఇప్పటి వరకూ అధికారులు తీసుకెళ్లలేదు. దీనిని బట్టి చూస్తే ఎన్నికల విభాగం అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

బడ్జెట్ వచ్చినా...

ఎన్నికల వ్యయానికి సంబంధించి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల కోసం ప్రస్తుతం రూ.17కోట్ల మేర బడ్జెట్ విడుదలైంది. దీంతో తమకు అందాల్సిన రెమ్యునరేషన్‌పై ఎఫ్ఎల్‌సీ నిర్వర్తించిన ఉద్యోగులు ఆశలు పెంచుకున్నారు. ఇప్పుడు కూడా ఇవ్వకపోతే ఇక రెమ్యునరేషన్ గురించి మర్చిపోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫైలు పరిశీలిస్తా

ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ఫైలు తెప్పించుకుని పరిశీలిస్తా. ప్రస్తుతం బడ్జెట్ కూడా వచ్చినందున ఎఫ్ఎల్‌సీ విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు రెమ్యునరేషన్ చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

– వినోద్‌కుమార్, కలెక్టర్

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య



అనిల్‌కుమార్ (ఫైల్)

రాప్తాడు: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... రాప్తాడు పంచాయతీ పరిధిలోని మైనారిటీ కాలనీలో నివాసముంటున్న వెంకటనారాయణ, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు బొమ్ము అనిల్‌కుమార్ (41)కు వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన హేమ చంద్రికతో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.మట్టి పెల్లల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే అనిల్‌కుమార్ ఇటీవల వ్యాపారంలో నష్టాలు చవిచూశాడు. దీంతో పరిశ్రమ అభివృద్ధి, కుటుంబ పోషణ కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు చేశాడు. అప్పులకు వడ్డీల భారం పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు తారాస్థాయికి చేరుకున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన అనిల్‌కుమార్... గురువారం ఉదయం పెల్లల ఫ్యాక్టరీ వద్దకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చి నేరుగా కందుకూరు రోడ్డులో ఉన్న రాప్తాడుకు చెందిన బోయ రాము రేకుల షెడ్‌లో డిష్ వైరుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. సమాచారం అందుకున్న రాప్తాడు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



హిమజ

అనంతపురం: నగరంలోని కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న డి. హిమజ అండర్–17 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. అక్టోబర్ 27 నుంచి 29వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన హిమజాను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పోలీసు స్టేషన్ ఎదుట ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

తాడిపత్రి రూరల్: స్థానిక రూరల్ అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం రాత్రి ఆటో డ్రైవర్ కృష్ణ ఆత్మహత్యాయత్నం చేశాడు. తాడిపత్రిలోని పోరాట కాలనీలో నివాసం ఉంటున్న కృష్ణ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా పిల్లలకు టపాసులు కొనుగోలు చేసేందుకు రూరల్ అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ సమీపంలోని వాసవి క్రాకర్స్ వద్ద గురువారం రాత్రి వెళ్లాడు. ఈ సమయంలో టపాసుల కొనుగోలు విషయంలో అక్కడి వారు దుర్భాషలాడడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆటోతో పాటు డ్రైవర్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. డ్రైవర్‌పై న్యూసెన్స్ కేసు పెట్టి ఆటోను సీజ్ చేశారు. శుక్రవారం ఉదయం సొంతపూచీ కత్తుపై విడుదలైన కృష్ణ... తనపై అన్యాయంగా కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేయడంతో బతుకు భారమవుతోందంటూ పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగాడు. నివ్వెరపోయిన పోలీసులు వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తీసుకెళ్లారు.

అవార్డు అందుకున్న 'సాక్షి' ఫొటోగ్రాఫర్



హైకోర్టు జడ్జి జస్టిస్ కె.మన్మథరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సాక్షి ఫొటోగ్రాఫర్ మహబూబ్ బాషా

అనంతపురం కల్చరల్: సాక్షి దినపత్రిక ఫొటోగ్రాఫర్ దూదేకుల మహబూబ్ బాషా (డీఎం బాషా) జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవం సందర్భంగా ఏపీ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి వారి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నెల ఆరంభంలో సంభవించిన వరదలపై డీఎం బాషా తీసిన ఫొటోను నిర్వాహకులు అవార్డుకు ఎంపిక చేశారు. విజయవాడ వేదికగా శుక్రవారం రాత్రి బహుమతుల ప్రదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు, అకాడమీ నిర్వాహకులు డాక్టర్ సుందర్ కొంపల్లి, గోళ్ల నారాయణరావు, శ్రీనివాసరెడ్డి తదితరుల చేతుల మీదుగా డీఎం బాషా అవార్డు అందుకున్నారు.

లోపాలు సవరించి పదోన్నతులు చేపట్టాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: సీనియార్టీ జాబితాలో లోపాలు సవరించిన తర్వాతనే మునిసిపల్ టీచర్ల పదోన్నతులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ... మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం విడుదల చేసిన సీనియార్టీ జాబితాలో అనేక తప్పులు ఉన్నాయన్నారు. రిటైర్డ్ అయిన వారు, మరణించిన వారు, బదిలీ అయిన వారి పేర్లు కూడా జాబితాలో పొందుపరిచారన్నారు. వివిధ పోస్టులకు అర్హత సాధించిన వారి వివరాలు ఎస్ఆర్‌లో నమోదు చేసినప్పటికీ సీనియార్టీ లిస్టులో వారి పేర్లు రాలేదన్నారు. ఖాళీల వివరాలను ఇప్పటిదాకా ప్రకటించలేదన్నారు. లోపాలను సవరించిన తర్వాతనే సీనియార్టీ జాబితా విడుదల చేసి పదోన్నతులు చేపట్టాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, నాయకులు సర్దార్ వలి, రమణ, కలీముల్లా, నస్రుల్లా, తిప్పేస్వామి, రామ్మూర్తి, హిమగిరి ప్రసాద్ ఉన్నారు.

విశ్రాంత జేడీ సుబ్రహ్మణ్యం బెనిఫిట్స్ నిలిపివేత

అనంతపురం సెంట్రల్: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పశుసంవర్ధకశాఖ జేడీ సుబ్రహ్మణ్యంకు అందాల్సిన బెనిఫిట్స్‌ను నిలిపివేస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2020–21లో ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌గా పనిచేస్తున్న సమయంలో జిల్లాలోని మూడు ప్రాథమిక సహకార సంఘాలకు సరఫరా చేసిన ఎరువులకు సంబంధించి బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. విడపనకల్లు మండలం కొట్టాలపల్లి సొసైటీ నుంచి రూ. 23 లక్షలు, వజ్రకరూరు మండలం పొట్టిపాడు సొసైటీ నుంచి రూ. 3.50 లక్షలు, గుమ్మఘట్ట సొసైటీ నుంచి రూ. 1.20 లక్షలు బకాయి ఉన్నట్లు సమాచారం. బకాయిల వసూళ్లపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో విశ్రాంత జేడీ సుబ్రహ్మణ్యంకు అందాల్సిన బెనిఫిట్స్‌ను నిలిపిస్తూ అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

వివాహిత దారుణ హత్య

- ప్రియుడిపైనే అనుమానాలు



మెహతాజ్ మృతదేహం

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్లలో గురువారం అర్ధరాత్రి ఓ వివాహిత హత్యకు గురైంది. అనుమానంతో ప్రియుడే ఆమెను అంతమొందించినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన మేరకు.... కొండకమర్లకు చెందిన గొర్ల అల్లాబకాష్‌కు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె మెహతాజ్ (32)కు 14 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన షేక్ బాబ్జాన్‌తో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం సాయంత్రం మెహతాజ్ పిల్లలతో కలసి పుట్టింటికి వచ్చింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి బయట శబ్దం రావడంతో ఇంట్లో నిద్రిస్తున్న వారు మేల్కొని బయటకు వచ్చారు. కొండకమర్ల గ్రామానికి చెందిన యువకుడు షేక్ ఇర్ఫాన్ బాషా గోడ దూకి పారిపోవడాన్ని గమనించి, చుట్టుపక్కల పరిశీలించారు. మెట్ల వద్ద మెహతాజ్ మృతదేహాన్ని గుర్తించారు. ఇర్ఫాన్‌బాషా ఆమెను హతమార్చి మృతదేహాన్ని మెట్లపై నుంచి కిందకు పడేసినట్లు నిర్ధారించుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాగా, చాలా ఏళ్లుగా మెహతాజ్, ఇర్ఫాన్ బాషా మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లుగా ప్రాథమిక విచారణలో పోలీసులు నిర్ధారించారు. ఇటీవల ఆమె మరొకరితో సన్నిహితంగా ఉంటోందన్న అనుమానంతో ప్రియుడే ఆమెను హతమార్చి పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. అయితే పోలీసులు ఈ విషయాన్ని ధ్రువీకరించాల్సి ఉంది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బొమ్మనహాళ్: [sic] బెళుగుప్ప: మండలంలోని రామసాగరం, ఉరవకొండ మండలం వై.రాంపురం గ్రామాల మధ్య స్థావరం ఏర్పాటు చేసుకుని పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు అప్రమత్తమైన ఎస్ఐ శివ, సిబ్బంది శుక్రవారం ఉదయం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న పది మంది పట్టుబడగా, వారి నుంచి రూ.1,50,600 నగదు, 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచున్నట్లు పోలీసులు తెలిపారు.

పింఛన్ తీసుకున్న గంటకే వృద్ధురాలి మృతి



పింఛన్ అందుకుంటున్న రుద్రమ్మ (ఫైల్)

బొమ్మనహాళ్: పింఛన్ డబ్బు తీసుకున్న గంటకే ఓ వృద్ధురాలు మృతిచెందింది. వివరాలు... బొమ్మనహాళ్ మండలం కల్లుదేవనహాళ్లి గ్రామానికి చెందిన దేవిరెడ్డి రుద్రమ్మ (70) అనారోగ్యంతో బాధపడుతూ కొన్ని రోజులుగా బళ్లారిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న సచివాలయ ఉద్యోగి గాయత్రి... శుక్రవారం బళ్లారిలోని ఆస్పత్రికి చేరుకుని మధ్యాహ్నం 3 గంటల సమయంలో వృద్ధురాలికి పింఛన్ డబ్బు అందజేశారు. సాయంత్రం 4 గంటలకు ఆమె మృతి చెందింది.

ఫర్టిలైజర్స్ డీలర్ల అసోసియేషన్ ఎన్నికలు నేడు

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి జిల్లా ఎరువులు, పురుగుమందులు, విత్తన డీలర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించనున్నారు. అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న రజాక్ ఫంక్షన్ హాల్ ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా, డీలర్ల సంఘం ఎన్నికలు ఈ సారి రసవత్తరంగా మారాయి. ఏకగ్రీవం చేసుకునేందుకు కొందరు యత్నిస్తుండగా, ఎన్నికలు నిర్వహించాలని మరికొందరు పట్టుబడుతున్నారు. ప్రధాన పదవులకు వెంకటేష్, పార్థసారథి, సిరిగుప్ప వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, రమేష్ రంగయ్య, వెంకట్‌బాబు తదితరులు పోటీపడుతున్నారు. ఎన్నికల పర్యవేక్షణకు రాష్ట్ర నాయకులు హాజరుకానున్నారు.

గోనె సంచుల గోదాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అనంతపురం: స్థానిక రమణ, రమేష్ థియేటర్ సమీపంలోని బోయ వీధిలో ఉన్న గోనె సంచుల గోదాములో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గురువారం రాత్రి భారీగా మంటలు ఎగిసి పడడంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనలో రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు యజమాని వాపోయాడు. కాగా, ప్రమాదానికి గల కారణాలపై పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు.

'నోబుల్ వరల్డ్ రికార్డ్స్'లో రామగిరి చిన్నారికి చోటు



చిన్నారి హన్వికతో తల్లిదండ్రులు

రామగిరి: మండలంలోని కలికివాండ్లపల్లి గ్రామానికి చెందిన చిన్నారి హన్వికాకు నోబుల్ వరల్డ్ రికార్డ్ బుక్‌లో చోటు దక్కింది. గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డి, అఖిల దంపతులకు 7 నెలల వయసున్న చిన్నారి హన్విక ఉంది. ఏదైనా పేరు చెబితే దాని ఆకారంలో ఉన్న కార్డును చిన్నారి గుర్తిస్తూ వస్తోంది. ఇలా దాదాపు 300 రకాల వస్తువులను చిన్నారి గుర్తిస్తుండడాన్ని కుటుంబసభ్యులు వీడియో తీసి తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన నోబుల్ వరల్డ్ రికార్డ్ బుక్ నిర్వాహకులకు పంపారు. చిన్నారి హన్విక ప్రతిభను గుర్తిస్తూ వారు బుక్‌లో చోటు కల్పించారు.

అరచేతిలో 'ఉపాధి' వివరాలు

- జన్‌మన్‌రేగా యాప్‌తో అక్రమాలకు చెక్
- స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు సులభంగా సేవలు
- సరైన అవగాహన లేక డౌన్‌లోడ్ చేసుకోని వైనం

జిల్లాలో జాబ్‌కార్డుల సంఖ్య **2.54** లక్షలు

ఉపాధి కూలీల సంఖ్య **4.17** లక్షలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జన్‌మన్‌రేగా యాప్‌పై సరైన అవగాహన కలిగి సద్వినియోగం చేసుకుంటే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీల చేతిలో ఓ బ్రహ్మాస్త్రం అవుతుందని అధికారులు అంటున్నారు. వేతన బకాయిలు జమ అయ్యాయో లేదో... జమ అయితే ఏ బ్యాంకులో పడ్డాయో తెలియక ఇప్పటికీ చాలా మంది కూలీలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఈ ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు 2017లో కేంద్ర ప్రభుత్వం ఈ సరికొత్త యాప్‌ను అమలులోకి తీసుకువచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనూ ఈ యాప్‌పై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాజకీయ కక్షతో ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. ఇలాంటి తరుణంలో ఉపాధి పథకంలో అక్రమాలు చోటు చేసుకోకుండా జన్‌మన్‌రేగా యాప్‌తో చెక్ పెట్టేందుకు వీలవుతుందని నిపుణులు అంటున్నారు.


యాప్ వినియోగం ఇలా...

సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి జన్‌మన్‌రేగా అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో కూలీల వివరాలు, హాజరు, వేతనాలు తదితర వివరాలు క్లిక్ చేస్తే బ్లాగ్ తెరుచుకుంటుంది. అందులో ఉపాధి జాబ్‌కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు వస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేయగానే పనిచేసిన రోజులు, వేతన బకాయి, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయింది... తదితర వివరాలు స్పష్టంగా తెలుసుకోవచ్చు. వేతనం జమ కాకపోతే ఎందుకు అనే అంశాన్ని తెలుసుకోవచ్చు. ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనుల సమాచారమూ ఉంటుంది.

అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చు

సరిహద్దు మండలాల్లో ఇటీవల బోగస్ మస్టర్లు పుట్టుకురావడం, పనులకు వెళ్లకపోయినా వచ్చినట్లుగా రికార్డులు నమోదు చేయడం లాంటి ఘటనలు సామాజిక తనిఖీల్లో వెలుగు చూస్తున్నాయి. కూలీల సొమ్ము స్వాహాతో పాటు ఇతర అక్రమాలపై కూడా జన్‌మన్‌రేగా యాప్ ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది. పని ప్రదేశాల్లో కూలీలతో కాకుండా యంత్రాలతో పనులు చేసినా... బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినా... నిధులు దుర్వినియోగం చేసి, దొంగ మస్టర్లకు పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేస్తే నేరుగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళుతుంది. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూరుస్తారు.

అవగాహన కల్పిస్తాం



జన్‌మన్‌రాగే యాప్ వినియోగంపై కూలీలందరికీ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం. సెల్‌ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్, వినియోగం తదితర అంశాలపై చైతన్య పరుస్తాం. కూలీలు కూడా ఈ యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. ఎంతో ఉపయోగపడే ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.సలీమ్‌బాషా, డ్వామా పీడీ, అనంతపురం

క్లుప్తంగా

సమాధుల పండుగకు సర్వం సిద్ధం



చాపెల్‌ను ప్రారంభించిన మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే సమాధుల పండుగకు అన్ని వసతులు కల్పించాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. శుక్రవారం డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయ భాస్కరరెడ్డి ఇతర అధికారులు జేఎన్‌టీయూ సమీపంలోని సమాధుల తోటను పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన చాపెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలోని క్రైస్తవులు పండుగ చేసుకునేందుకు సమాధుల తోటను ఆహ్లాదంగా మారుస్తున్నామన్నారు. తోటను శుభ్రం చేయడం, తాగునీరు, లైటింగ్ వంటి సౌకర్యాలలో లోపం లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, రామాంజనేయులు, కమల్ భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శీను, సమాధుల తోట అధ్యక్షుడు సుందరరావు, కార్యదర్శి జయరాజ్, పాస్టర్ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



షాపు యాజమానికి కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

అనంతపురం సిటీ/రాప్తాడు: బాల కార్మికుల ఏరివేతకు ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. స్పెషల్ డ్రైవ్ పేరుతో జిల్లా వ్యాప్తంగా విస్తతంగా పర్యటిస్తూ బాల కార్మికులను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బళ్లారి నున్న శ్రీదేవి, కార్మిక శాఖ అధికారులు సుజాత, ప్రసాద్ ఆధ్వర్యంలో ఐసీపీఎస్ సోషల్ వర్కర్ వెంకట కుమార్, ఆయా మండలాల ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అనంతపురం సమీపంలోని ఆటో నగర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హోటళ్లు, దుకాణాలు, ఇతర షాపుల యాజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని తెలిపారు. అటువంటి పిల్లలను బడికి కాకుండా పనికి పంపే తల్లిదండ్రులను కూడా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



సత్తా చాటిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కనగానపల్లి: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ మాధవరాజులు తెలిపారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన రేఖ, రేణుక అనే విద్యార్థినులు సత్తా చాటినట్లు పేర్కొన్నారు. ఇందులో మెరుగైన ప్రతిభ కనబరిచిన వీరిద్దరిని ఈనెల 5వ తేదీ నుంచి నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రవికిరణ్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా విద్యార్థినులను అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందించిన ఉపాధ్యాయులు

రాప్తాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ఖోఖో క్రీడా పోటీలు జరిగాయి. అండర్–17 విభాగంలో రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భవిత, నంద కిషోర్, అండర్–14 విభాగంలో తరుణ్, ప్రవీణ్, దేవేంద్ర, పూర్ణ చందు జిల్లా స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. అండర్–17 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు అనకాపల్లి జిల్లా, అండర్–14 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్ఎం సాంబశివా, పీడీలు రాజశేఖర్ రెడ్డి, ఎన్.కేశవ మూర్తి, ఉపాధ్యాయులు నరసింహులు, కేశవయ్య, నల్లప్ప, అర్షద్, రోజా రమణి, జయలక్ష్మి, సీనియర్ క్రీడాకారులు ఆదినారాయణ, తరుణ్, చైతన్య, నగేష్ అభినందించారు.

కార్తీకం.. ఆధ్యాత్మికం

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- కాంతులీననున్న శైవక్షేత్రాలు
- ముస్తాబైన ఆలయాలు



కార్తీకంలో పూజలందుకునే మహాశివుడు



జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన కాశీవిశ్వేశ్వరాలయం

అనంతపురం కల్చరల్: మహాశివుడికి ప్రీతికరమైన మాసంగా కార్తీకం దీపావళి ముగిసిన వెంటనే ప్రారంభమవుతుంది. కానీ ఈసారి చతుర్ధశి, అమావాస్య ఒకేరోజు రావడంతో పాటూ శుక్రవారం కూడా మిగులు ఉండటంతో శనివారం నుంచి పవిత్ర కార్తీక మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసం రోజులు జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు కాంతులీనుతాయి. శివనామస్మరణతో మార్మోగుతాయి. ఆస్తికుల పాలిట కామధేనువుగా పిలుచుకునే కార్తీక మాసం సూర్యభగవానుడు తులారాశిలో సంచారంలో ఉండగా వస్తుంది. ఈ మాసంలో చన్నీటి స్నానానికి విశేష ప్రాధాన్యత కనపడుతుంది. సామూహిక నోములు, ఉపవాసాలు, జ్వాలాతోరణాలతో పాటూ నిత్య దీపారాధన కార్తీకం విశిష్టత.

ప్రత్యేక దినాలివే..

కార్తీక శుద్ధ పాడ్యమి నుంచి వచ్చే నెల అమావాస్య వరకు అంటే ఈనెల 2 నుంచి డిసెంబర్ 1 వరకు ఉండే కార్తీకంలో ప్రతి రోజూ పవిత్రమే. అయినా సోమవారాలు ప్రత్యేక దినాలుగా పరిగణింపబడుతూ పెద్ద ఎత్తున పూజలకు నిలయంగా మారుతాయి. ఈ క్రమంలో ఈనెల 4, 11, 18, 25 తేదీల్లో వరుసగా కార్తీక సోమవారాలు వస్తాయి. 15న కార్తీక పౌర్ణమి, 16న జ్వాలాతోరణం, దీపోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి జిల్లా కేంద్రంలోని ప్రధాన శివాలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, చిన్మయా జగదీశ్వరాలయం, శివబాలయోగి ఆశ్రమం, శారదా శంకరమ మఠం, శివకోటి, హెచ్చెల్సీ కాలనీ మంజునాథేశ్వరాలయం, అరవింద నగర్ సర్వేశ్వరాలయం తదితర శైవాలయాలకు భక్తులు పోటెత్తుతారు. కార్తీక మాసమంతటా ఆధ్యాత్మిక భావజాలం ఉట్టిపడేలా ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యాయి.

భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం



జిల్లా కేంద్రంలో వందేళ్ల చరిత్ర కలిగిన కాశీవిశ్వేశ్వరాలయం ఎంతో మహిమాన్వితమని భక్తుల నమ్మకం. కాబట్టే కార్తీకం వచ్చిందంటే మరెక్కడా లేనట్టు భక్తజనం పోటెత్తుతారు. ముఖ్యంగా కార్తీక సోమవారాలు, కార్తీక పౌర్ణమి, కైశికద్వాదశి, జ్వాలాతోరణంతో పాటూ ఇక్కడ మాత్రమే శివపార్వతుల కల్యాణోత్సవం జరుగుతుంది. పర్వదినాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం. ఈసారి కార్తీక పూజలు మరింత ఘనంగా సాగేలా అర్చక బృందాలు సన్నాహాలు చేస్తున్నారు.

– సాకే రమేష్‌బాబు, ఈఓ, శివాలయం

కుర్లపల్లిలో వైద్యాధికారుల పర్యటన



ఆరోగ్య సూచనలు ఇస్తున్న జిల్లా మలేరియా అధికారులు

ఆత్మకూరు: మండలంలోని కుర్లపల్లి గ్రామంలో ఓ వ్యక్తికి మలేరియా జ్వరం రావడంతో శుక్రవారం వైద్య సిబ్బంది, జిల్లా మలేరియా అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా మలేరియా సోకిన వ్యక్తికి వైద్య పరీక్షలు చేశారు. 14 రోజుల పాటు జాగ్రత్తగా వైద్యం చేయించుకోవాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, జిల్లా మలేరియా అధికారి ఓబులు మాట్లాడుతూ.. లార్వా, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అందులో భాగంగా వీధుల్లో మలాథియాన్ పిచికారీ స్ప్రేయింగ్ చేయించారు. అనంతరం గ్రామస్తులకు పలు సూచనలు ఇచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మురుగు నీటి కాలువల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఆరు వారాల పాటు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అదే విధంగా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, డాక్టర్ సబిహా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పీసీ సుబ్బరాజుకు శస్త్రచికిత్స

అనంతపురం మెడికల్: కలెక్టరేట్‌లోని ట్రెజరీలో విధులు నిర్వర్తిస్తూ గన్ మిస్‌ఫైర్ కావడంతో గాయపడిన పీసీ సుబ్బరాజుకు సర్జరీ విభాగం వైద్యులు శస్త్రచికిత్సను విజయవంతం చేశారు. శుక్రవారం సుబ్బరాజును ఆస్పత్రికి తీసుకురాగానే సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఆదేశాలతో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామి నాయక్, అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమాబాయి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గణేష్‌రెడ్డి తదితరులు శస్త్రచికిత్స చేశారు. బుల్లెట్ ప్రవేశించడంతో దెబ్బతిన్న కణజాలం మొత్తాన్ని తొలగించి రక్తస్రావాన్ని అరికట్టారు. అనంతరం బుల్లెట్ వెళ్లిన ప్రాంతాన్ని శుభ్రం (ఊండ్ ఎక్స్‌ప్లోరేషన్ విత్ డిబ్రైడ్మెంట్ అండ్ త్రూ వాష్) చేశారు. దాదాపుగా 50 నిమిషాల పాటు జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైంది. అనంతరం సుబ్బరాజును ఎస్ఐసీయూకు తరలించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత సుబ్బరాజును పరిశీలించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పీసీ సుబ్బరాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. మరో రెండ్రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పీహెచ్ వర్కర్‌తో ఎలా పని చేయిస్తారు?

అనంతపురం కార్పొరేషన్: పీహెచ్ వర్కర్‌గా ఉన్న హర్షవర్ధన్‌ను కంప్యూటర్ ఆపరేటర్‌గా ఎలా వినియోగించుకుంటారని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్ విధులకు వెళ్లగా సీఐటీయూ నాయకులు అడ్డుకున్నారు. 26 మంది కార్మికుల వేతనాలు అందకపోవడంతో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసిన హర్షవర్ధన్ నిర్లక్ష్యం ఉందని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఆ సమయంలో హర్షవర్ధన్‌కు మద్దతుగా ఎమ్మార్పీఎస్ నాయకులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్రమైన వాగ్వాదం చోటు చేసుకుంది. కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. చివరకు అధికారులు సైతం ఇరు వర్గాలకు ఏమీ చెప్పలేక పోయారు. చివరకు హర్షవర్ధన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయినా నగరపాలక సంస్థలో ఉద్యోగుల విధుల విషయంలో సంఘాలు జోక్యం చేసుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

వెనుకబడిన విద్యార్థుల కోసం ‘గణిత దీప్తి’



గణిత దీప్తిని ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల కోసం రాష్ట్ర గణితఫోరం ఆధ్వర్యంలో ‘గణిత దీప్తి’ రూపొందించినట్లు గణితఫోరం నాయకులు వెల్లడించారు. శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబు చేతుల మీదుగా ‘గణిత దీప్తి’ని ఆవిష్కరించారు. జిల్లాలోని గణిత ఉపాధ్యాయులు గణిత ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. గణిత ఉపాధ్యాయులు తమ బోధనలో భాగంగా ఐఎఫ్‌పీలను ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా ఇన్‌స్పైర్ పోటీల్లో గణిత ఉపాధ్యాయులు కూడా భాగస్వామ్యం వహించాలని కోరారు. జిల్లా గణిత ఫోరం పిల్లల గణితాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. జాతీయ గణిత దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గణిత ఫోరం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేసులు, ప్రధాన కార్యదర్శి ఎం.శివప్రసాద్, గౌరవ సలహాదారులుం రమణారెడ్డి, రాష్ట్ర బాధ్యులు ఈశ్వరయ్య, ప్రతాప్, కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, జయరాం నాయక్, కుమార స్వామి, రాజశేఖర్ రావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

కనగానపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్.రామచంద్రారెడ్డి (53) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని పర్వతదేవరపల్లి గ్రామానికి చెందిన మృతుడు రామచంద్రారెడ్డి గత శనివారం ద్విచక్ర వాహనంలో వస్తూ మరూరు టోల్ గేట్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని మొదట అనంతపురం తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం బెంగుళూరులో ఒక ప్రవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. కానీ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య రమాదేవి, కూతురు, కుమారుడు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి

విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మారుతిప్రసాద్ పలువురు మండల నాయకులు పర్వతదేవరపల్లికి చేరుకున్నారు. ఎస్.రామచంద్రారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన రామచంద్రారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, నాగముని, ఎంపీటీసీ క్రిష్టారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రామలింగారెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని ప్రయత్నించాలి



మాట్లాడుతున్న పాండిచ్చేరి విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకర్ నాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంబీఏ, ఎంకామ్ కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకర్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంబీఏ, ఎంకామ్ చేసిన విద్యార్థులకు లభించే అవకాశాలు, వ్యక్తిగతంగా ప్రొఫెషనల్ అభివృద్ధికి ఎలా ఉపయోగపడతాయో ప్రభాకర్‌నాయక్ వివరించారు. తాను ఇదే జిల్లాలో ఓ చిన్న గ్రామం నుంచి బయలుదేరి ఉన్న విద్య కోసం ఎదుర్కొన్న సవాళ్లను విద్యార్థులతో పంచుకున్నారు. లక్ష్యం నిర్దేశించుకుని ప్రయత్నిస్తే కచ్చితంగా ఫలితం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్.శ్రీరాములు, రవీంద్రారెడ్డి, డాక్టర్ ఎం. మల్లికార్జున, వి.శ్రీనివాసులు, శర్మిల రామయ్య, మంజునాథ్ పాల్గొన్నారు.

డీఈఓను కలసిన పీఆర్టీయూ నాయకులు



డీఈఓ ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబును శుక్రవారం ప్రోగ్రెస్సివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) నాయకులు కలిశారు. కొత్త డీఈఓకు పూర్తిగా సహకరించి జిల్లాలో విద్యాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు తమవంతు కృషి చేస్తామని పీఆర్టీయూ నాయకులు వెల్లడించారు. అనంతరం డీఈఓను సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి. పురుషోత్తమరెడ్డి, జి. తిమ్మారెడ్డి, సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, టి. చంద్రశేఖర్ రెడ్డి, శివారెడ్డి, రామమూర్తి, ప్రసాద్ రెడ్డి, కేశవ రెడ్డి, కె.చంద్ర మోహన్ రెడ్డి, కె.యల్లప్ప, సి.రామమోహన్ రెడ్డి, సి.వెంకటేసులు, టి.హనుమంత రెడ్డి, బి.వేమారెడ్డి, జి.వెంకట నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గురుదాస్ దాస్‌గుప్తా



గురుదాస్ దాస్‌గుప్తా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం అర్బన్: కార్మికుల హక్కుల కోసం పోరాడిన ఏఐటీయూసీ అగ్రనేత గురుదాస్ దాస్‌గుప్తా స్ఫూర్తితో ఉద్యమాలు సాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన గురుదాస్ దాస్‌గుప్తా వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. గురుదాస్ దాస్‌గుప్త కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు సాగించిన నాయకుడని కొనియాడారు. ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, నాయకులు చంద్రానాయక్, శ్రీరాములు, అల్లీపీరా, రాజేష్‌గౌడ్, కృష్ణుడు, పద్మావతి, నాగవేణి, పార్వతి ప్రసాద్, చిరంజీవి, కుళ్లాయి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యం తగదు’

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణపై ఇంకా ఎన్నాళ్లు మోసపోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప మాదిగ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంశంపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ అంశం రాష్ట్ర పరిధిలో ఉన్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వర్గీకరణపై మాదిగలు ఐక్యతతో పోరాటాలు చేపట్టాలన్నారు. ఆ దిశగా అందరు ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేపీ నారాయణ స్వామి, సుంకన్న, రామాంజినేయులు, మండల రమేష్, నాగరాజు, సంపత్ కుమార్, రవి, గంగాధర్, ధారా శంకర్, చెన్నప్ప, మూర్తి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్‌కు నివాళి



వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో ఉన్న యునాని వైద్యశాలలో గురువారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహించారు. యునాని వైద్యుడు ఖాదర్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. దేశ ప్రథమ హోంశాఖ మంత్రిగా దేశాన్ని ఏకఖండంగా తీర్చిదిద్దిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కే దక్కుతుందని తెలిపారు. ఈయన జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా జరుపుకుంటారన్నారు.

రైల్వే రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

అనంతపురం సిటీ: అనంతపురం రైల్వే స్టేషన్ పరిధిలో పని చేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులు శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా కేఎస్ మోహన్, అధ్యక్షుడిగా సీసీఎస్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్‌కే ఖాదర్‌వలి, సెక్రటరీగా ఎస్.పి. కోవిందరాజులు, కోశాధికారిగా పి.సురేశ్‌ను ఎన్నుకున్నారు. అంతకు ముందు సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారం కోసం ఉన్నతాధికారులను కలసి విన్నవించాలని నిర్ణయం తీసుకున్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో సత్తా



విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్ నగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థినులు రంగిశెట్టి మనస్విని, రంగిశెట్టి మాసిని టేబుల్‌టెన్నిస్ అండర్–14, అండర్–17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కుసుమ పుల్లారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, పీఈటీ కేశవరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికై జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జాతీయ చెస్ జట్టుకు ఎంపిక

అనంతపురం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జాతీయ అండర్–14 చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు అనంతపురం జిల్లాకు చెందిన జొన్నగడ్డల నితీష్ చౌదరి ఎంపికయ్యాడు. ఇటీవల లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 68వ రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఇందులో జొన్నగడ్డల నితీష్ చౌదరి ప్రతిభ చాటి 5/6 పాయింట్లు సాధించాడు. రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానం కైవసం చేసుకున్నాడు. 2025 జనవరి 21 నుంచి 24వ తేదీ వరకూ మహారాష్ట్రలో జరగబోయే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ 68వ జాతీయ అండర్–14 బాలుర చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తాడు.



అనంతపురంలో దీపాలను వెలిగించిన చిన్నారులు

దీపావళి శోభ



బాణసంచా వెలుగుల్లో సందడి



కాకర పూలు కాలుస్తున్న దృశ్యం



చిన్నారులకు టపాసులను అందజేస్తున్న దృశ్యం

రాప్తాడు/ఆత్మకూరు: రాప్తాడు, అనంతపురం నియోజకవర్గాల్లో గురువారం దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలు, ఇళ్లలో గౌరీమాతను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. గృహాలను కొవ్వొత్తులు, నెయ్యి దీపాలతో అందంగా అలంకరించారు. యువకులు, పిల్లలు టపాకాయలు కాలుస్తూ సందడి చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బాలసదనంలో..

అనంతపురం సెంట్రల్: నగరంలో బుడ్డప్ప నగర్‌లోని బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతిపథం యూత్ అసోషియేషన్ ప్రతినిధులు టపాసులు అందజేశారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి బిసాతి భరత్, సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్ ప్రణీతి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యనిర్వాహఖ కార్యదర్శులు ఈరమ్మ, చాందినీ, రూబీఖాన్, నవనీ, నందిత తదితరులు పాల్గొన్నారు.



కమలా నగర్‌లో టపాసులు కాలుస్తున్న ఓ కుటుంబం